# కేసీఆర్ పాలనలో తెలంగాణ నంబర్ వన్



వేల్పూర్ మండల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పాల్గొన్న కార్యకర్తలు

### ఒకే పార్టీ, ఒకే నాయకుడు..

పార్టీకోసం, ఉద్యమం కోసం తన తండ్రి సురేందర్ రెడ్డి ఎన్నో త్యాగాలు చేశారని మంత్రి గుర్తుచేశారు. తన కుటుంబం 23 ఏండ్లుగా ఒకే పార్టీ, ఒకే నాయకుడిని నమ్ముకున్నదని, ఎన్నడూ పదవుల కోసం పక్కకు చూడలేని మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్ మాటను జవదాటలేదన్నారు. అందుకే అసాధ్యం అనుకున్న ఎన్నో అభివృద్ధి పనులను కేసీఆర్ దయతో సాధ్యం చేసుకున్నామన్నారు.

- కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం.. నేడు దేశానికే ఆదర్శంగా నిలిచింది
- బీఆర్ఎస్‌ది సూపర్, డూపర్ మ్యానిఫెస్టో
- కార్యకర్తలు ప్రతి గడపకూ తీసుకెళ్లాలి
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి పిలుపు



బాల్కొండలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న మంత్రి వేముల

వేల్పూర్/బాల్కొండ, అక్టోబర్ 28: కేసీఆర్ పాలనలో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో ఉన్నదని, కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్, బాల్కొండ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలను శనివారం ఆయా మండలాల్లో నిర్వహించగా, మంత్రి హాజరయ్యారు. ఎన్నికల్లో ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహంపై కార్యకర్తలకు సూచనలు చేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో సూపర్ డూపర్‌గా ఉన్నదని వేముల తెలిపారు. సౌభాగ్యలక్ష్మి, రూ.400లకే గ్యాస్, పేద కుటుంబాలకు కేసీఆర్ బీమా తదితర కొత్త పథకాలతోపాటు పింఛన్లు, రైతుబంధు సాయం పెంచనున్నట్లు చెప్పారు. పార్టీ హామీలను కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లాలని కోరారు. వేల్పూర్ మండలంలో సుమారుగా పోలయ్యే ఓట్లు 25వేలు ఉంటాయని తెలిపారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అందుకున్నవారు 26,600 మంది ఉన్నారని స్పష్టం చేశారు. కార్యకర్తలు భేషజాలకు పోకుండా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరి మద్దతునూ కూడగట్టి ఓటేయించాలని సూచించారు. సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానని తెలిపారు. అభివృద్ధితోపాటు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందన్నారు. బీఆర్ఎస్ సైనికులు కష్టపడితే 90 శాతం ఓట్లు కారు గుర్తుకే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ భాస్కర్‌యాదవ్, కోటపాటి నర్సింహనాయుడు తదితరులు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని కార్యకర్తలకు వివరించారు. వేములను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్తకర్తలు కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కమ్మ కులస్తులు నా కుటుంబ సభ్యులు

- వారితో 30 ఏండ్ల అనుబంధం ఉంది
- నన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు
- చంద్రబాబు అరెస్టు దుర్మార్గం
- వెంటనే విడుదల చేయాలి
- కమ్మ ఆత్మీయ సమ్మేళనంలో స్పీకర్ పోచారం



పోచారం శ్రీనివాసరెడ్డికి నామినేషన్ ఫీజును అందజేస్తున్న అప్పసాని శ్రీనివాస్‌రావు

వర్ని, అక్టోబర్ 28: కమ్మ కులస్తులు తన కుటుంబ సభ్యులేనని, వారి ఏ కష్టం వచ్చినా, ఇబ్బందులు తలెత్తినా అండగా ఉంటానని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కాలికి ముల్లు గుచ్చితే పంటితో తీస్తానన్నారు. కమ్మవారితో తనకు విడదీయలేని అనుబంధం ఉన్నదని, 30 ఏండ్లుగా తనను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని తెలిపారు. బాన్సువాడలో ప్రతిపక్షాలకు అభ్యర్థులే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. స్పీకర్‌కు మద్దతుగా శనివారం బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల కమ్మ కులస్తులు 500 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్ని మండల కేంద్రంలో నిర్వహించిన కమ్మ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో స్పీకర్ మాట్లాడారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా బాన్సువాడ నియోజకవర్గంలో కమ్మ సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగిందన్నారు. వ్యవసాయం చేసుకుంటున్న తనను శ్రీనివాసరావు ప్రోత్సహించి రాజకీయాల వైపు తీసుకొచ్చారని, ఆ తర్వాత రాజకీయంగా అనేక అవకాశాలు కల్పించింది ఎన్టీఆర్ అని గుర్తు చేసుకున్నారు.

### ప్రతిపక్షాలకు అభ్యర్థులే కరువు..

నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, కుల సంఘాలు తనకు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటిస్తున్నాయని పోచారం తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తాను భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని సర్వేలు చెబుతున్నాయన్నారు. బాన్సువాడలో ప్రతిపక్షాలకు అభ్యర్థులే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. భారీ కార్ల ర్యాలీతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం వేల కోట్లు ఖర్చు చేశానంటే దానికి కారణం సీఎం కేసీఆర్ పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేయడమేనని వివరించారు. వ్యవసాయ రంగంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉంటే, రాష్ట్రంలో బాన్సువాడ నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందన్నారు.

### చంద్రబాబు అరెస్టు దుర్మార్గం..

సీనియర్ నాయకుడు చంద్రబాబు అరెస్టును స్పీకర్ పోచారం ఖండించారు. 14 ఏండ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిని రాజకీయ కక్షలతో అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పార్టీలు వేరైనా వ్యక్తిగతంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఆధారాలు లేకుండా అరెస్టు చేసిన చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని కోరారు. అంతకుముందు పోచారం శ్రీనివాసరెడ్డి నామినేషన్ ఫీజు కోసం రూ.25వేలను వర్ని మండలం నెహ్రూనగర్‌కు చెందిన అప్పసాని శ్రీనివాసరావు అందజేశారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, స్పీకర్ సతీమణి పుష్ప, కోడలు సోనీరెడ్డి, వర్ని, కోటగిరి ఎంపీపీలు మేక శ్రీలక్ష్మి వీర్రాజు, సునీతా శ్రీనివాస్ రావు, బీర్కూర్ జడ్పీటీసీ సతీశ్, వర్ని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, నాయకులు రవికిరణ్, రెడ్డి వీర్రాజు, మేక వీర్రాజు, కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వర్నిలో కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కమ్మ కులస్తులు

# మైనారిటీలకు పెద్దపీట

- మైనారిటీ బంధు, షాదీముబారక్ దేశానికే ఆదర్శం
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి, అక్టోబర్ 28: బీఆర్ఎస్ ప్రభుత్వం మైనారిటీలకు పెద్దపీట వేస్తున్నదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. నగర పరిధిలోని 10, 11, 32వ డివిజన్ల ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనాన్ని లిమ్రా గార్డెన్‌లో నిర్వహించగా, గణేశ్‌గుప్తా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న షాదీ ముబారక్, మైనారిటీ బంధు పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. మైనారిటీలకు రూ. లక్ష ఆర్థికసాయం చేసి అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నది తెలంగాణ రాష్ట్రమొక్కటేనని తెలిపారు. మైనారిటీ విద్యార్థుల కోసం నగర పరిధిలో 8 గురుకులాలను ఏర్పాటుచేసి 4వేల మంది పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మ్యానిఫెస్టోలో కేసీఆర్ ప్రకటించిన కొత్త పథకాలు వస్తాయని తెలిపారు. రూ.400లకే వంట గ్యాస్, ఆసరా పింఛన్ల పెంపు, పేద మహిళలకు సౌభాగ్యలక్ష్మి కింద రూ.3వేలు, రేషన్ దుకాణల్లో సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. ముస్లింలు బీఆర్ఎస్‌ను బలపర్చి తనను మరోసారి గెలిపించాలని గణేశ్‌గుప్తా కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, రెడ్కో మాజీ చైర్మన్ అలీం, మైనారిటీ నాయకులు మజాజ్‌అలీ, నవీద్ ఇక్బాల్, కుద్దూస్, అక్బర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ముస్లింలు



# బీఆర్ఎస్ సర్కారు దళిత పక్షపాతి

- ప్రజలే నాకు బాస్
- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి
- ప్రజల కోసం కష్టపడే నాయకుడు బాజిరెడ్డి: వీజీ గౌడ్



కింద కూర్చొని దళితులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, అక్టోబర్ 28: యాభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఒరగబెట్టిందేమీ లేదని, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాతే దళితులను ఆదుకోవడానికి సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి, వారికి సమాజంలో మంచి గుర్తింపు తెస్తున్నారని రూరల్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని జీ-కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన దళితుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో రెండుసార్లు నక్సలైట్లు తనను చంపడానికి బుల్లెట్లు దించారని, అయినా భయపడలేదన్నారు. ప్రజల దీవెనలతో భగవంతుడు తనను బతికించాడని తెలిపారు. తనకు ప్రజలే బాస్ అని స్పష్టం చేశారు. రూరల్‌లో 1100 మందికి దళితబంధు మంజూరు చేశామని, పథకం అందనివారు నిరుత్సాహపడొద్దని, విడుతలవారీగా అందరికీ అందజేస్తామని హామీ ఇచ్చారు. దళితులను కొందరు రెచ్చగొట్టి తనను అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సమస్య ఉన్న చోటికే వెళ్లి దళితులకు మనోధైర్యం కల్పించానన్నారు. నియోజకవర్గంలో రూ.9.34కోట్లతో 166 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నామని, దళిత వాడల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ. 30కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఓడిపోయిన డాక్టర్ భూపతిరెడ్డి.. ఎన్నికల తర్వాత ప్రజలను గాలికొదిలేసి పారిపోయాడని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు రాగానే దొంగ ఏడ్పులతో మోసం చేసేందుకు మీ ముందుకు వస్తున్నాడని మండిపడ్డారు. ఏడ్చే మగాడిని ఎప్పుడూ నమ్మొద్దన్నారు. బీఎస్పీ అధినేత మాయావతి దళితురాలై ఉండి కూడా బీజేపీకి మద్దతు ఇస్తున్నారని, బీజేపీ అధికారంలో ఉన్న యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో దళితులపై అనేక దౌర్జన్యాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అలాంటి పార్టీలను దగ్గరికి రానివ్వొద్దని కోరారు.


### మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్: భారీ మెజారిటీ అందిద్దాం

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రూరల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ మాట్లాడుతూ.. 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్.. తెలంగాణలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. దళితబంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్‌కు అండగా నిలబడి మూడోసారి కూడా భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, కమ్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలగర శ్రీనివాస్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పద్మారావు, రూరల్ కన్వీనర్ పాశం కుమార్, నాయకులు పాల్గొన్నారు.

# జనమే నా బలం

- అభివృద్ధి, సంక్షేమమే నా అస్త్రాలు
- నేరగాళ్ల మాయలో పడకండి
- బీజేపీ, కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా డౌటే
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాక్లూర్, అక్టోబర్ 28: నియోజకవర్గ జనమే తన బలమని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలే తన ప్రచార అస్త్రాలని పేర్కొన్నారు. తనను మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. మండలంలోని వేణుకిసాన్‌నగర్ తండా, గంగరమంద, రాంపూర్, వెంకటాపూర్, మెట్‌పల్లి, ధర్మోరా, మాందాపూర్, వల్లభాపూర్ గ్రామాల్లో శనివారం ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు జీవన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు అనుగు నీరజ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల్లో తొమ్మిదేండ్లలో పూర్తిచేసిన అభివృద్ధి పనులను జీవన్‌రెడ్డి వివరించారు. ఆర్మూర్ నియోజకవర్గం అంటేనే అభివృద్ధికి చిరునామా అని అన్నారు. ప్రతి గ్రామంలో కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు చేశానని తెలిపారు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. మాక్లూర్ మండలానికి రూ . కోట్లాది నిధులు కేటాయించినట్లు తెలిపారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కొత్త సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ తీసుకురానున్నారని చెప్పారు. దసరా వేషగాళ్లు, సంక్రాంత్రి గంగిరెద్దులోళ్లు తనతో పోటీకి వస్తారనుకుంటే.. ప్రజల మధ్య చిచ్చుపెట్టే నేరగాళ్లు వచ్చారని మండిపడ్డారు. వారి మాయలో పడొద్దని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్, బీజేపీకి డిపాజిట్ కూడా దక్కదని ఎద్దేవా చేశారు. ప్రచారంలో ఆయా గ్రామాల సర్పంచులు రమేశ్ నాయక్, గంగాధర్, సాయిలు, భవానీరఘు, సులోచన, శైలజ, మంజులాసుధాకర్, ఎంపీపీ ప్రభాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యం, విండో చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



గంగరమంద గ్రామంలో మాట్లాడతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి